క్లుప్తంగా

గజపతినగరంలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వ ర్యంలో శుక్రవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 49 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, ఉచి తంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటిం టికీ వెళ్లి వైద్యశిబిరానికి రాలేకపోయిన బెడ్‌రెస్ట్ రోగులు, వృద్ధులకు వైద్యసేవలందించారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



సమావేశమైన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కమిటీ చైర్మన్, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన శుక్రవారం నిర్వహిం చారు. కాంటిజెంట్ వర్కర్లకు జీతాల చెల్లింపు తో పాటు ఆస్పత్రికి అవసరమైన పరికరాల కొనుగోలు, ఇతర అభివృద్ధి పనులపై చర్చిం చారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, బొద్దాం సర్పంచ్ ఎర్రా రామసత్యవతి, గ్రామపెద్దలు దుల్ల మహేష్, డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్



చీపురుపల్లిలో తాగునీటి ట్యాంకును శుభ్రం చేసి, క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: మండల ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినే షన్ చేసేందుకు చర్యలు ప్రారంభించామని ఈఓపీఆర్డీ ఐ.సురేష్ చెప్పారు. కలెక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆదేశాల మేరకు మండలంలో శానిటేషన్ వీక్ నిర్వహణను శుక్రవారం ప్రారం భించారు. అన్ని పంచాయతీల్లో తాగునీటి పథ కాల ట్యాంకులను శుభ్రం చేయించాలని పం చాయతీ కార్యదర్శులను ఇప్పటికే ఆదేశిం చామని ఈఓపీఆర్డీ చెప్పారు. ట్యాంకుల పరిశు భ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, విధుల్లో అలసత్వం వహించే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు.

ట్యాంకులతో తాగునీరు సరఫరా



ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకులతో తాగునీరు సరఫరా

గుర్ల: మండల కేంద్రంలో డయేరియా ప్రబల డంతో ఇప్పటివరకు ఎనిమిది మంది మృతి చెందగా, వందల మంది వ్యాధి లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. అయితే డయేరియా ప్రబలడానికి గ్రామంలోని తాగునీరు కలుషితం కావడం కూడా ఒక కారణమని అధికారులు చెబుతున్నారు. దీంతో గ్రామస్తు లు తాగునీటికి ఇబ్బందులు పడకుండా గత నాలుగు రోజులుగా ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకుల ద్వారా ఇక్కడి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. చీపురుపల్లి నుంచి ట్యాంకులతో తాగునీరు ఇక్కడికి తీసుకువచ్చి ప్రజలకు సర ఫరా చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారు లు కూడా మరో ఎనిమిది ట్యాంకుల ద్వారా తాగునీరు అందిస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ లోపం



గుర్లలోని సారికి వీధి కాలువలో పేరుకుపోయిన చెత్త

గుర్ల: మండల కేంద్రంలో డయేరియా డెంజర్ బెల్స్ మోగిస్తోంది. అయినప్పటికీ గ్రామ శివారు సత్తారు వీధి, సారికి వీధి, బీసీ కాల నీల్లో అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ పను లు సక్రమంగా చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహ దారికి ఆనుకొని ఉన్న వీధుల్లో మాత్రమే పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లుతున్నా రని, శివారు వీధుల్లో ఎలాంటి పారిశుద్ధ్య పను లు చేపట్ట లేదన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి.

నిరుపయోగంగా ఎస్‌డబ్ల్యూపీసీలు

- చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల్లో తయారు కాని వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువులు
- గజపతినగరం మండలంలో 26 పంచాయతీల్లో కేంద్రాల ఏర్పాటు
- రెండు,మూడు చోట్ల తప్ప మిగతా చోట కానరాని నిర్వహణ



నిరుపయోగంగా ఉన్న పురిటిపెంటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



కేంద్రం ఆవరణలో వృథాగా ఉన్న కుండీలు

గజపతినగరం: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా, గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నా యి.మండలంలో 30 గ్రామ పంచాయతీలు ఉండ గా ఎం.కొత్తవలస, రంగుపురం, భూదేవి పేట, మర్రివలస పంచాయతీల్లో తప్ప మిగతా పంచాయ తీల్లో సుమారు రూ.1.30 కోట్ల స్వచ్ఛభారత్ మిషన్ నిధులతో చెత్త నుంచి సంపద తయా రీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో రోజూ గ్రీన్ అంబాసి డర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి, పొడి చెత్తతో పాటు వీధుల్లో పేరుకు పోయిన చెత్తను రిక్షాల ద్వారా ఈ కేంద్రాలకు తరలించాలి. అక్కడ తడి, పొడి చెత్తను వేరుగా కుండీల్లో వేసి వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించడం, అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను స్క్రాప్ దుకాణాలకు విక్రయించి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నదే ఈ కేం ద్రాల ఏర్పాటు వెనుక లక్ష్యం. అయితే కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో లక్ష్యం నీరు గారుతోంది. మండలంలోని 26 కేంద్రాల్లో ప్రస్తుతం రెండు, మూడు పంచాయతీల్లో కేంద్రా లను నిర్వహిస్తున్నారు. మిగతా చోట అలంకర ప్రాయంగా మిగిలాయి. కొన్ని కేంద్రాలు అసాం ఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. అధికారులు స్పందించి తక్షణమే కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం..



మండలంలోని ఎస్‌డ బ్ల్యూపీసీలను క్షేత్రస్థాయి లో పరిశీలించి, నిరుప యోగంగా ఉన్న వాటిని తక్షణమే వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసు కుంటాం. కేంద్రాల్లో వర్మి కంపోస్టు తయారు చేయించి, రైతులకు తక్కువ ధరకు విక్రయించే లా చూస్తాం.

– బి.కల్యాణి, గజపతినగరం ఎంపీడీఓ

ఓటు హక్కు నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాజారావు

చీపురుపల్లి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తహ సీల్దార్ ఎన్.రాజారావు సూచించారు. ఓటు హక్కు నమోదు, ఆవశ్యకతపై పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవ గాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ప్రతీ పౌరుడు తమ విధిగా భావించాలన్నారు. 2025 జనవరి1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. ప్రతీ బీఎల్ఓ దగ్గర ఓటు హక్కు నమోదు దరఖాస్తులు ఉంటాయని లేదా తహసీల్దార్ కార్యాల యంలో దరఖాస్తులు అందు బాటులో ఉంటాయని తెలిపారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్ష వర్థిని, కళాశాల ప్రిన్సిపాల్ ఏ.డి.ఎన్.ఎస్.వి. ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయ

జామి: స్థానిక రైతుసేవా కేంద్రంలో వ్యవసాయశా ఖ సిబ్బందికి సమాచారహక్కు చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు.కొత్తవలస సబ్‌డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు ఎల్.వి జయ చట్టం ప్రాధాన్యం, పరిరక్షణ, తదితర అంశా లను వివరించారు.ఏఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాల్లో తనిఖీలు



గురుకుల విద్యార్థినుల విద్యా సామర్థ్యాలను పరీక్షిస్తున్న జడ్జి ప్రేమలత

చీపురుపల్లి: పట్టణంలోని లావేరురోడ్‌లోని బీసీ సం క్షేమ బాలికల వసతి గృహం, మెయిన్‌రోడ్‌లోని బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత శుక్ర వారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వసతిగృహం , గురుకులంలో విద్యార్థినుల కోసం వండిన వం టకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తు న్నదీ లేనిది విద్యార్థినులను ఆరా తీశారు. గురుకులంలో విద్యార్థినులను విద్యా సామర్థ్యా లను పరీక్షించారు.

మెనూ పాటించాలి



కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని బక్కునాయుడుపేట కేజీబీ వీ(కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం) ఎస్ఓ కిరణ్మయికి ఎంఈఓ బాలభాస్కరరావు సూచిం చారు. కేజీబీవీని శుక్రవారం ఆయన సందర్శిం చారు. వసతి గృహంలో సదుపాయాలను పరిశీలిం చి, విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థినులతో మధ్యాహ్న భోజనం చేశారు. అనం తరం అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌం ట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డుల నమోదుపై ఉపాధ్యా యినులను ఆరా తీశారు. పదోతరగతిలో విద్యా ర్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయినులకు సూచించారు. అలా గే మోడల్ స్కూల్‌ను సందర్శించి అపార్ కార్డుల రిజిస్ట్రేషన్ వివరాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



దత్తిరాజేరు: పాపయ్యవలసలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మెరకముడిదాం: గొట్టుపల్లిలో భూమి పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బొండపల్లి: రయింద్రం గ్రామంలో భూమి పూజ చేస్తున్న సర్పంచ్, అధికారులు

గంట్యాడ/దత్తిరాజేరు/జామి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండగ కార్యక్రమం నిర్వహిస్తున్నా మని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గంట్యాడ,దత్తిరాజేరు, జామి మండలాల్లోని పెంటశ్రీరాంపురం, మదనాపురం, విజయరాంపురం, పాపయ్యలవలస, దత్తి, బోజరా జపురం, యాతపాలెం గ్రామాల్లో ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, కాలువలు, బీటీ రోడ్ల నిర్మాణానికి శుక్ర వారం ఆయన శంకుస్థాపన చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు మంత్రి సూచించారు. ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, పంచాయతీ రాజ్ ఇంజినీ రింగ్, ఉపాధి హామీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వేపాడ: వల్లంపూడిలో భూమిపూజ చేస్తున్న సర్పంచ్,గ్రామపెద్దలు

మెరకముడిదాం మండలంలో..

మెరకముడిదాం: మండలంలోని గొట్టుపల్లి, శ్యామా యవలస, ఊటపల్లి గ్రామాల్లో ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ఆయా పంచాయ తీల అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఎంపీడీఓ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ మండలంలో..

వేపాడ: పల్లె పండగలో భాగంగా మండలంలోని వల్లంపూడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ రుద్ర అంజిలీదేవి, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు శుక్ర వారం భూమి పూజ చేశారు. స్థానిక నాయకులు శానాపతి గణేష్,మహేష్, పంచాయతీకార్యదర్శి పద్మావతి, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం, రయింద్రం గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఎంపీడీఓ జి.గిరిబాల, సర్పం చ్‌లు బొడ్డు కృష్ణవేణి, ఎం.శ్రీనివాసరాజు, బొడ్డు రాము, ఈఓపీఆర్డీ ఏ.రఘుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



దత్తిరాజేరు: గదబవలసలో మాట్లాడుతున్న బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహన్‌రావు



వేపాడ: జమ్మాదేవిపేటలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ రాములమ్మ

దత్తిరాజేరు: గతంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల భూముల వివరాల నమోదుతో పాటు ఏమైనా భూసమస్యలు ఉంటే పరిష్కరించడమే లక్ష్యం గా గ్రామసభలు నిర్వహిస్తున్నామని బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహన్‌రావు తెలిపారు.మండలంలోని గదబవ లస గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహిం చారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. రీసర్వే డీటీ రత్నకుమారి, వీఆర్ఓ కార్తికేయ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జమ్మాదేవిపేటలో..

వేపాడ: మండలంలోని జమ్మాదేవిపేటలో తహ సీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గతంలో నిర్వ హించిన రీసర్వేకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని రైతులను కోరారు. ఏమైనా సవ రణలు అవసరమైతే సరిచేస్తామని చెప్పారు. గ్రామ సభలు ఈనెల 30వరకు జరుగుతాయన్నారు. 19న నీలకంఠరాజపురం, 21న పెదగుడిపాల, 22న బల్లంకితుని, కె.పి.రాజపురం, 23న బల్లంకి, 24న బానాది, 25న రాయుడుపేట, 26న చామలాపల్లి, 28న అరిగిపాలెం, 29న ఓబల య్యపాలెం, 30న ముకుందపురం గ్రామా ల్లో గ్రామసభలు నిర్వహిం చనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ గొటి వాడ దేవి, ఎంపీ టీసీ వేచలపు వెంకట చినరాము నాయుడు, గ్రామపెద్దలు జగ్గుబాబు, పోతల వెంక టరమణ పాల్గొన్నారు.

పర్యవేక్షణ అంతంతమాత్రమే..!



ఇప్పలవలసలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న భవనం ఇదే

మెరకముడిదాం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్లు, ఉన్నతాధికా రుల పర్యవేక్షణ అంతంతమా త్రంగానే ఉంది. ముఖ్యంగా మండలంలోని ఇప్పలవలసలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రా లను అధికారులు కనీసం తనిఖీ కూడా చేయడం లేదనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. దీంతో కార్యకర్తలు ఇష్టం వచ్చినట్లు కేం ద్రాలను నిర్వహిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్నారుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తున్నారని, అలాగే సొంత భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తూ ప్రభుత్వం నుంచి అద్దె తీసుకుం టున్నారన్న విమర్శలున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు కేం ద్రాలను పర్యవేక్షించి, పక్కాగా నడిచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

26వ తేదీ వరకు శానిటేషన్ డ్రైవ్

గజపతినగరం: మండలంలో ఈనెల 26వ తేదీ వరకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించనున్న ట్లు ఎంపీడీఓ బి.కల్యాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు, తాగునీటి ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ చేయనున్నట్లు పేర్కొ న్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలి



రైతుసేవా కేంద్రంలో పశుసంవర్థకశాఖ రికార్డులు పరిశీలిస్తున్న ఆశాఖ ఏడీ చలపతిరావు

వేపాడ: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయించాలని గొర్రెలు, మేకల కాప ర్లకు ఎస్.కోట పశుసంవర్థక శాఖ ఏడీ చలప తిరావు సూచించారు. మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు పశుసంవర్థక శాఖ సిబ్బందితో కలిసి శుక్రవారం నట్టల నివారణ మం దులు వేశారు. అలాగే పశువైద్యశిబిరం నిర్వహించి 30 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో 28,910 గొర్రెలు,మేకలు ఉన్నాయని, ఇప్పటివ రకు 6,862 జీవాలకు నట్టల నివారణ మందు వేశా మని చెప్పారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో పశు సంవర్ధక శాఖ రికార్డులను పరిశీ లించారు.

లే అవుట్ యజమానిపై చర్యలు తీసుకోండి

బొండపల్లి: మండలం పరిధిలోని రయింద్రాం గ్రామానికి వెళ్లే రహదారిలో కనిమెరక రెవెన్యూ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసిన యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాల ని జైభీమ్ అంబేడ్కర్ సేవా సంఘ అధ్యక్షుడు బగ్గా ఎర్రయ్య కోరారు. ఈ మేరకు తహసీల్దార్ డోల రాజేశ్వరరావును శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ, ఎటువంటి అనుమతుల్లేకుండా వ్యవ సాయ భూమిలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నార న్నారు. ఈ లే అవుట్‌కు ల్యాండ్ కన్వర్షన్, ఉడా, ఏపీ రెరా, తదితర అనుమతుల్లేవని చెప్పారు.

రైల్వే పనులకు సేకరించిన భూముల పరిశీలన



కోమటిపల్లిలో రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ రామ్మోహన్‌రావు

దత్తిరాజేరు: రైల్వే ట్రాక్(మూడో లైన్) కోసం మం డలంలో గతంలో సేకరించిన భూముల్లో ఇంకా పనులు ప్రారంభం కాని సమస్యాత్మక భూములను బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహన్‌రావు శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ విజయ భాస్కర్‌తో కలిసి పెద మానాపురం, కోమటిపల్లి, మరడాం గ్రామాల్లో భూములను పరిశీలించారు. పనులకు ఎందుకు రైతులు సహకరించడం లేదని వీఆర్ఓ, మండల సర్వేయర్‌ను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం రైతులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి పరిహారం రావాల్సి ఉంటే రికార్డుల పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామ ని, రైల్వే పనులకు ఆటంకం కలిగించవద్దని చెప్పారు.

మాజీ వీఓఏపై చర్యలకు డిమాండ్

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామైక్య సం ఘం మాజీ వీఓఏ చప్పా నాగమణిపై వెలుగు అధికారులు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎం పీపీ చల్లా చలం నాయుడు శుక్రవారం ఓ ప్రకటన లో డిమాండ్ చేశారు. మాజీ వీఓఏ గ్రామంలోని 60 స్వయం సహాయక సంఘాల లావాదేవీల్లో అవ కతవకలకు పాల్పడ్డారని, లక్షల రూపాయలు అవినీతి చేశారని తెలిపారు. అవినీతికి పాల్పడిన నగదును ఆమె నుంచి రికవరీ చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారు లు ఆమెపై చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్‌లో నిర్వ హించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

సీబీసీఎన్‌సీ ఆస్తులపై విచారణ హర్షణీయం

- ట్రస్ట్ అసోసియేషన్ ఛైర్మన్ ఆర్.ఎస్.జాన్



మాట్లాడుతున్న సీబీసీఎన్‌సీ ట్రస్ట్ అసోసియేషన్ ఛైర్మన్ ఆర్‌ఎస్ జాన్

విజయనగరం టౌన్: సీబీసీఎన్‌సీ ఆస్తులపై బొబ్బిలి ఎమ్మెల్యే విచారణ చేపడ తామని హామీ ఇవ్వడం హర్షణీయమని సీబీసీఎన్‌సీ ట్రస్ట్ అసోసియేషన్ ఛైర్మన్ ఆర్ఎస్ జాన్ అన్నారు. శుక్రవారం స్థానిక సిమ్స్ చర్చి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1975లో కెనడా నుంచి వచ్చిన క్రైస్తవులు ఈస్ట్, వెస్ట్, ఉత్తరాంధ్ర, తదితర ప్రాంతాల్లో నిరుపేదల కోసం ఆస్పత్రులు, చర్చిలు, స్కూళ్లు కట్టారన్నారు. 1979 వరకు సీబీసీఎన్‌సీ ఆధీనం లో ఉన్న ఆస్తులపై కొన్నిచోట్ల ఇబ్బందులేర్పడ్డాయని చెప్పారు. ఈ తరుణంలో బొబ్బిలిలో ఉన్న సీబీఎం గరల్స్ హైస్కూల్‌కి చెందిన సుమారు రూ. 50 కోట్ల విలువైన స్థలాన్ని రత్నకుమార్ అనే వ్యక్తి అక్కడ వేరే వ్యక్తికి విక్రయించాడని తెలిపారు. అలాగే మరికొన్ని చోట్ల కూడా సీబీసీఎన్‌సీ ఆస్తులు పరాధీనం అయ్యాయని చెప్పారు. ఇదిలా ఉంటే ఈ నెల 16న బొబ్బిలి ఎమ్మెల్యే బేబినా యన సీబీసీఎన్‌సీ ఆస్తులపై విచారణ చేస్తామన్న ప్రకటించడం హర్షణీ యమన్నారు. విచారణ చేపట్టి సంస్థ ఆస్తులను కాపాడాలని కోరారు. కార్యక్ర మంలో లీగల్ అడ్వైజర్ ఆదాడ మోహనరావు, తాలాడ ఆనందరావు, తదిత రులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు

- సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లిమర్ల: ప్రజలపై సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ భారాలు మోపవద్దని సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశా రు. విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని కోరుతూ శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఏఈ పిచ్చకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరిట 20 వేల కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమన్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ బాదుడే బాదుడు.. అనే కార్యక్రమాన్ని నిర్వహించి, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం చార్జీలు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో కనకల రాము, బి. నారాయణ, ఎం. సన్యాసిరావు, జె. సత్యారావు, టి. తాత, తదితరులు పాల్గొన్నారు.